
అశ్వారావుపేట టౌన్ : కాలింగుల బజారులో భోగి మంటలు వేసి సందడి చేస్తున్న కాలనీవాసులు

# జిల్లాలో 'భోగి' సందడి

## నగరాలు, పట్టణాల నుంచి సొంతూళ్లకు చేరుకొని వేడుకలు

## అయిన వారి ఆప్యాయతల మధ్య ఆనందంగా చిన్నారులు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భోగి పండుగ సందడి నెలకొంది. ప్రతి ఇంటిలోనూ సంబురాలు అంబరాన్నంటాయి. విద్య, ఉద్యోగం, ఉపాధి అవకాశాల కోసం హైదరాబాద్ సహా పలు పట్టణాల్లో నివాసం ఉంటున్న జిల్లా వాసులు.. సంక్రాంతి పండుగ కోసం సొంతూళ్లకు చేరుకున్నారు. ప్రజా రవాణా సాధనాల్లోనూ, సొంత వాహనాల్లోనూ ఇంటికి చేరుకున్న తమ వారికి కుటుంబ సభ్యులు సాదర స్వాగతం పలికారు. అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యలు సహా అయిన వారి మధ్య చిన్నారులు ఆనందంగా గడిపారు. తమ జన్మస్థలాలను, పుట్టి పెరిగిన జాడలను కళ్లారా చూసుకుంటూ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఇక సోమవారం వేకువ జామునే భోగి మంటలు వేసి సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. భోగి మంటల్లో నీటిని కాగించి చిన్నా పెద్దా తలంటు స్నానాలు చేశారు. రేగిపళ్లతో పిల్లలకు స్నానం చేయించారు. అనంతరం వారిని ఆశీర్వదించారు. తరువాత పిల్లలు పతంగుల ఆటల్లోనూ, పెద్దలు పిండివంటల తయారీలోనూ నిమగ్నమయ్యారు. కొత్తగా వివాహాలు జరిపించిన వారి ఇళ్లల్లో.. కుమార్తెలు, కొత్త అల్లుళ్లతో సంబురాలు, సందడి వాతావరణాలు నెలకొన్నాయి.


చంద్రుగొండలోని ఇంటిలో పేర్చిన బొమ్మలు (దేవుళ్ల బొమ్మలు)


అన్నపురెడ్డిపల్లి : శివాలయంలో భోగి మంటలు


అశ్వారావుపేట : భోగి మంటల వద్ద చలి కాగుతున్న ప్రజలు


ఇల్లెందురూరల్ : భోగి మంటలు వేస్తున్న ప్రజలు


టేకులపల్లి : భోగి మంటల వేడుకలో పాల్గొన్న బొమ్మెర వరప్రసాద్, తదితరులు


దుమ్ముగూడెం : భోగి మంటల వద్ద గ్రామస్తులు


మణుగూరు టౌన్ : భోగి మంటల వద్ద పిల్లలు, పెద్దలు


ఇల్లెందు : జేకే గ్రౌండ్‌లో వాకర్స్ భోగి మంటలు


ఇల్లెందురూరల్ : పతంగుల సందడి


పాల్వంచ : ఇంటి ముందు ముగ్గులు వేస్తున్న మహిళలు

సంక్రాంతి శుభాకాంక్షలు
తెలంగాణ విద్యుత్ ఉద్యోగ కార్మిక సిబ్బంది, కార్మిక సోదర, సోదరీమణులకు, ఆర్టిసన్స్ కు ఇవే మా సంక్రాంతి శుభాకాంక్షలు...
M.A.వజీర్
సెంట్రల్ కమిటి అధ్యక్షులు
తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్
1535, సెల్: 9849015359

సంక్రాంతి శుభాకాంక్షలు
మిత్రులకు, శ్రేయోభిలాషులకు, మణుగూరు మండల ప్రజలకు అధికారులకు, ప్రజాప్రతినిధులకు సంక్రాంతి శుభాకాంక్షలు..
వేమిరెడ్డి రాఘవరెడ్డి
తహశీల్దార్, మణుగూరు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా
మరియు
తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది

సంక్రాంతి శుభాకాంక్షలు
మిత్రులకు, శ్రేయోభిలాషులకు, అధికారులకు ప్రజాప్రతినిధులకు, సుజాతనగర్ మండల ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు
పెద్దమళ్ళ శోభారాణి
EX : MPTC- సుజాతనగర్

సంక్రాంతి శుభాకాంక్షలు
మిత్రులకు, శ్రేయోభిలాషులకు, కొత్తగూడెం మండల ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు..
కొత్తగూడెం మండల ప్రజలు
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

## నేడు కార్మికులకు వేతనంతో కూడిన సెలవు


కార్మికులతో టీబీజీకేఎస్ నాయకులు

మణుగూరు టౌన్, జనవరి 13: సింగరేణి కార్మికులకు సంక్రాంతి పండుగ ఆప్షనల్ హాలీడే (వేతనంతో కూడిన సెలవు) అమలు చేయడం అభినందనీయమని టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు నాగెల్లి అన్నారు. వేతనంతో కూడిన సెలవును వర్తింపజేయడంతో ఏడాదికి ఒకేసారి వచ్చే పండుగలను కార్మికులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జరుపుకుంటున్నారని అన్నారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

భద్రాచలం, జనవరి 13: భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వద్ద గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. ఆసుపత్రికి సమీపంలోని ఓ మెడికల్ దుకాణం వద్ద విగతజీవిగా ఓ వ్యక్తి పడి ఉండడాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు మృతదేహాన్ని ఏరియా వైద్యశాల మార్చురీలో భద్రపరిచారు. విచారణలో మృతుడు రెండు నెలలుగా వైద్యశాల సమీప ప్రాంతాల్లో బిక్షాటన చేసి జీవనం సాగిస్తున్నాడని, అతను టీబీ వ్యాధితో బాధపడుతూ ఏరియా వైద్యశాలలో మందులు వాడుతున్నట్లు వెల్లడైంది. దీంతో ఆసుప్రతి రికార్డులను పరిశీలించగా అతని పేరు శంకర్(55)గా గుర్తించారు. కుటుంబ సభ్యుల వివరాలు రికార్డుల్లో లేకపోవడంతో మృతుడి ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఫొటోను గుర్తుపట్టిన వారు స్థానిక పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై రామకృష్ణ కోరారు.

## రెండు ఆటోలు ఢీ.. నలుగురికి గాయాలు

జూలూరుపాడు, జనవరి 13 : రెండు ఆటోలు ఎదురెదురుగా ఢీకొని బోల్తా పడడంతో నలుగురికి తీవ్రగాయాలైన ఘటన మండల పరిధిలోని పడమటనర్సాపురం సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మంజిల్లా ఏన్కూరు మండలంలోని కేసుపల్లికి చెందిన క్రాంతి, రవి, వీరభద్రం ఆటోలో కొత్తగూడెం వెళ్తుండగా కొత్తగూడెం నుంచి ఏన్కూరు వైపు వెళ్తున్న ట్రాలీఆటో గిరిజన ఆశ్రమ పాఠశాల వద్ద ఎదురుగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు ఆటోలు బోల్తా పడగా క్రాంతి కాలు రెండుచోట్ల విరిగింది. మధు, ప్రసాద్, వీరభద్రంకు గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 వాహనంలో క్షతగాత్రులను కొత్తగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

## బైక్ అదుపు తప్పి విద్యార్థి మృతి

టేకులపల్లి, జనవరి 13 : బైక్ అదుపు తప్పి పడిపోవడంతో 10వ తరగతి విద్యార్థి మృతిచెందాడు. బోడు ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. టేకులపల్లి మండలం బర్లగూడెం పంచాయతీ మొట్లగూడెం గ్రామానికి చెందిన ఈసం రాంబాబు(లేటు), రాంబాయిల కుమారుడు ఈసం రోహిత్(19) సోమవారం ఉదయం మొట్లగూడెం నుంచి టేకులపల్లికి బైక్‌పై వెళ్తున్నాడు. మార్గమధ్యంలో కారేపల్లితండా సమీపాన బైక్ అదుపు తప్పి పడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. వైద్యం కోసం ఇల్లెందు తరలిస్తున్న క్రమంలో మృతిచెందాడు.

## కోడిపందేల స్థావరంపై దాడి

### 8 మందిపై కేసు నమోదు


ఘటనా స్థలం వద్ద నిందితులు, పందెం కోళ్లు, మోటార్ సైకిళ్లు

టేకులపల్లి, జనవరి 13 : మండల పరిధిలోని మారుమూల గిరిజన ప్రాంత అడవిలో నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరాలపై పోలీసులు దాడి చేసి ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. బోడు ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. టేకులపల్లి మండలం బర్లగూడెం గ్రామ పంచాయతీ పరిధి మొట్లగూడెం గ్రామ శివారు అటవీప్రాంతంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. ఈ దాడిలో రూ.59 వేల నగదు, 8మంది వ్యక్తులు, 18 కోళ్లు, 8 సెల్‌ఫోన్లు, 16 మోటార్ సైకిల్స్ పట్టుబడినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## ఐఎఫ్‌టీయూ సభను విజయవంతం చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు, కార్మికులు

టేకులపల్లి, జనవరి 13 : కొత్తగూడెంలో ఈ నెల 18వ తేదీన జరుగనున్న ఐఎఫ్‌టీయూ విలీన సభను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు డి.ప్రసాద్ కోరారు. సోమవారం టేకులపల్లి మండలం బద్దు తండా పంచాయతీలోని తుమ్మలచెలక ఎఫ్‌సీఐ గోడౌన్ కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మికవర్గం ఉద్యమించాలని కోరారు. సమావేశంలో నాయకులు బోడ మంచ, శ్రీరాములు, మహేష్, బిచ్చు, రవి, బన్నీ, మోతిలాల్, బాల, కిషన్, ప్రసాద్, శ్రీను పాల్గొన్నారు.

## పేదలకు బీఆర్ఎస్ నేత చేయూత


వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న కుటుంబ సభ్యులు

అశ్వారావుపేట, జనవరి 13 : మండలంలోని దురదపాడు గ్రామంలో పేదలకు బీఆర్ఎస్ నాయకుడు బిర్రం వెంకటేశ్వరరావు సోమవారం కొత్త దుస్తులు వితరణ చేశారు. గ్రామంలోని గిరిజనులతో కలిసి ఆయన కుటుంబ సభ్యులు భోగి వేడుకలను జరుపుకున్నారు. వృద్ధులు, వితంతువులకు వెంకటేశ్వరరావు మనువడు జతిన్, మనువరాలు హేమశ్రీ చేతులమీదుగా దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పండా ముత్యాలు, కుంజా అర్జున్, రాజులు, ముత్యాలు, కాకా భద్రం, మడకం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## మాంజా దారంతో బాలుడికి గాయాలు

రామవరం, జనవరి 13 : పతంగి ఎగురవేసే మాంజా దారం కాలుకు తగిలి బాలుడికి గాయాలైన ఘటన సోమవారం కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని చిట్టిరామవరంలో చోటుచేసుకుంది. కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. బదావత్ తమన్ రామవరం నుంచి తన సోదరుడితో కలిసి చిట్టిరామవరం వెళ్తున్న క్రమంలో చిట్టిరామవరం వద్ద చైనా మాంజా కాలుకు తగిలి కాలు మూడంగుళాల లోతు కోసుకుపోయింది. కుటుంబ సభ్యులు వెంటనే కొత్తగూడెంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

## క్రీడల్లో నైపుణ్యం చూపాలి


క్రీడాకారులనుద్దేశించి మాట్లాడుతున్న సీఐ వినయ్

పాల్వంచ రూరల్, జనవరి 13 : యువకులు తమకు ఇష్టమైన క్రీడల్లో నైపుణ్యం చూపి విజయాలు సాధించాలని సీఐ వినయ్ క్రీడాకారులను కోరారు. మండలంలోని కిన్నెరసాని స్పోర్ట్స్ మైదానంలో నాలుగురోజుల పాటు సాగే జిల్లాస్థాయి కొమరంభీమ్ క్రికెట్ టోర్నమెంటును సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో మాట్లాడుతూ క్రీడాకారులు కఠోర సాధన చేసి విజయాలు సాధించాలని, చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. టోర్నమెంట్‌లో జిల్లావ్యాప్తంగా ఇరవై జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో రూరల్ ఎస్సై సురేష్, నిర్వాహకులు ఉదయ్, ఆరిఫ్, విక్రాంత్, సురేష్, రామకృష్ణ, శ్యామ్ పాల్గొన్నారు.

## రామాలయ సూపరింటెండెంట్ బదిలీ

### ప్రొటోకాల్ పాటించకపోవడమే కారణమా?

భద్రాచలం, జనవరి 13 : భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయ సూపరింటెండెంట్ సాయిబాబును సోమవారం పర్ణశాల ఆలయానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో కత్తి శ్రీనివాసును రామాలయ సూపరింటెండెంట్‌గా నియమించారు. అయితే రామాలయ సూపరింటెండెంట్‌ను బదిలీ చేయడానికి ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామివారి ఉత్తర ద్వార దర్శనానికి వచ్చిన రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్‌కు ప్రొటోకాల్ దర్శనం కల్పించకపోవడమే కారణమని తెలుస్తున్నది.

## ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు



ఇల్లెందు, జనవరి 13 : ఇల్లెందు నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్ సోమవారం ఒక ప్రకటనలో సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పండుగ పర్వదినాన ప్రతి కుటుంబం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు.

## భద్రాద్రిలో భక్తుల సందడి


భక్తులతో కిక్కిరిసిన క్యూలైన్లు

భద్రాచలం, జనవరి 13: భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో సోమవారం గోదాదేవి అమ్మవారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. వైదిక సిబ్బంది విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణదారణ, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ నిర్వహించారు. అలాగే సోమవారం సందర్భంగా భద్రాద్రి రామయ్య భక్తులకు ముత్తంగి అలంకారంలో దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే క్యూలైన్లలో భక్తుల రద్దీ నెలకొనడంతో ఆలయంలో ఇతర ఆర్జిత సేవలను రద్దు చేసి దర్శనాలకు భక్తులను అనుమతించారు.

## 17వ యూసఫ్ ట్రోఫీ ఆవిష్కరణ



ట్రోఫీలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

బూర్గంపాడు, జనవరి 13: బూర్గంపాడు మండల కేంద్రంలో 17 ఏళ్లుగా నిర్వహిస్తున్న యూసఫ్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ట్రోఫీలను ట్రోఫీ స్పాన్సర్ డేగల రాజుయాదవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఒక మిత్రుని జ్ఞాపకార్థంగా 17 ఏళ్లుగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అతిశయోక్తి కాదని, ఒక సామాన్య వ్యక్తి పేరు మీద 17 సంవత్సరాలుగా ఒక ప్రైవేటు టోర్నమెంటు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కమిటీ సలహాదారులు ఎండీ సోహెల్ పాషా, సర్వేశ్వరరావు, బొల్లు రవికుమార్, ప్రసాద్, అబ్దుల్ సలీం, సారథి, కిశోర్ పాల్గొన్నారు.

## అపరిచిత వ్యక్తులు కనిపిస్తే సమాచారమివ్వాలి


గొత్తికోయ ప్రజలతో మాట్లాడుతున్న సీఐ సురేష్

ఆళ్లపల్లి, జనవరి 13: గ్రామంలో అపరిచిత వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని టేకులపల్లి సీఐ సురేష్, ఆళ్లపల్లి ఎస్సై రతీష్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని వెంకటాపురం పంచాయతీ పాలగుంపు గోత్తికోయ గుంపు నందు పోలీస్‌శాఖ సిబ్బందితో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. అనంతరం వారితో మాట్లాడుతూ.. గ్రామంలో ఎవరైన అపరిచిత వ్యక్తులు కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని, సంఘ విద్రోహ శక్తులకు సహకరించవద్దని సూచించారు.

## కోడిపందేల నిర్వహణపై డ్రోన్ పర్యవేక్షణ


డ్రోన్లతో పర్యవేక్షిస్తున్న పోలీసులు

అశ్వారావుపేట, జనవరి 13: అశ్వారావుపేట పోలీస్ సర్కిల్ పరిధిలో కోడి పందేలు, జూదం నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని సీఐ కరుణాకర్ హెచ్చరించారు. కోడిపందేల నిర్వహణపై డ్రోన్ పర్యవేక్షణ చేస్తున్నట్లు ఆయన చెప్పారు. అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో రెండు డ్రోన్లు ఏర్పాటు చేసి ప్రత్యేక బృందాలను నియమించినట్లు వివరించారు. ఈ మేరకు కోడిపందేల నిర్వాహణపై సోమవారం డ్రోన్లతో పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల, గ్రామస్థాయిలో టీములను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జూదరులకు గెస్ట్‌హౌస్‌లు, తోటలు, భూములు ఇచ్చి ప్రోత్సహించే యజమానులపైనా కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. కోడిపందేలు నియంత్రణకు పాత నిందితులపై బైండోవర్ కేసులు నమోదు చేశామని చెప్పారు. కార్యక్రమంలో అశ్వారావుపేట, దమ్మపేట ఎస్సైలు యయాతి రాజు, సాయి కిషోర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.